సాక్షి సిద్దిపేట
గురువారం । 13 । జూన్ । 2024

సిద్దిపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు





సిద్దిపేటలో పాఠశాలకు వెళుతున్న విద్యార్థిని



తోరణాలు సిద్ధం చేస్తున్న విద్యార్థులు

మోగిన బడి గంటలు

పాఠశాలలు పునఃప్రారంభం

- మామిడి తోరణాలతో ముస్తాబు
- యూనిఫాంలను అందజేసిన ఎమ్మెల్యే హరీశ్, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి
- పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్‌ల పంపిణీ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): 2024–25 నూతన విద్యా సంవత్సరం బుధవారం ప్రారంభమైంది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను మామిడి తోరణాలతో సుందరంగా అలంకరించారు. తొలిరోజు తమ తల్లిదండ్రులతో విద్యార్థులు హాజరయ్యారు. అనంతరం పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, యూనిఫాంలు అందుకున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి హాజరయ్యారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, యూనిఫాంలు అందించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులకు స్వాగతం తెలిపారు.

మెగా డీఎస్సీ పేరిట దగా: మాజీ మంత్రి హరీశ్‌రావు

కాంగ్రెస్ 25 వేల ఖాళీలతో మెగా డీఎస్సీ ప్రకటిస్తామని హామీ ఇచ్చి నేడు 11 వేల ఖాళీలతో మాత్రమే డీఎస్సీ పరీక్షలు నిర్వహించే అవకాశం ఉందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. రాష్ట్రంలో సిద్దిపేటకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. మూడు సంవత్సరాల క్రితం పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మొదటి స్థానం సాధించామన్నారు. రెండేళ్లుగా రెండో స్థానంలో నిలుస్తున్నామన్నారు. మళ్లీ మొదటి స్థానం వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థులను వారి తల్లిదండ్రులు పాఠశాలలకు విధిగా పంపించాలన్నారు. అప్పుడే వారి జీవితం బంగారుమయంగా మారుతుందన్నారు. మన ఊరు మన బడిలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలుగా మారాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్‌ను అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. గతంలో పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్ కోసం తన సొంత నిధులు 5 లక్షల రూపాయలతో ఏర్పాటు చేశానన్నారు.

తొలిరోజు.. 26,300 మంది హాజరు

తొలిరోజు జిల్లావ్యాప్తంగా ఉన్న 980 ప్రభుత్వ పాఠశాలల్లో 26,300 మంది విద్యార్థులు హాజరయినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి

బీసీ సంక్షేమ అభివృద్ధి జిల్లా అధికారి సరోజ

హుస్నాబాద్‌రూరల్: మన ఊరు మన బడిలో పిల్లలు చేరి చదువుకోవాలని బీసీ సంక్షేమ అభివృద్ధి జిల్లా అధికారి సరోజ అన్నారు. బుధవారం పోతారం (ఎస్) పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, దుస్తులను ఆమె పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడానికి కొత్త ప్రభుత్వం ప్రణాళికలను రూపొందిస్తుందన్నారు. ప్రతి విద్యార్థిని ఉన్నత స్థానాలకు చేర్చేలా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పౌష్టికాహారంతో పాటు దుస్తులు, పుస్తకాలను ఇస్తుందన్నారు. మీర్జాపూర్ పాఠశాలలో ఎంపీపీ మానస కూడా పుస్తకాలను పంపిణీ చేశారు.



పోతారం(ఎస్)లో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న సరోజ

చదువుల్లో రాణించాలి: ఎమ్మెల్సీ యాదవరెడ్డి



జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు చదువుల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. బడిబాటలో భాగంగా గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లోగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలను అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన అందుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఇక్కడే చదివించాలన్నారు.

న్యూస్‌రీల్

రోజు విడిచి రోజు నీటి సరఫరా

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో 2 రోజులపాటుగా రోజు విడిచి రోజు తాగునీటి సరఫరా చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి బుధవారం తెలిపారు. మల్లన్న సాగర్ వాటర్ ట్రీట్మెట్ ప్లాంట్‌లో మోటార్‌ల మరమ్మతులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గురువారం నుంచి మున్సిపాలిటీ పరిధిలోని 2, 3, 17 నుంచి 28వ వార్డు వరకు, 31, 36 వార్డు నుంచి 42 వార్డు వరకు నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. అందువల్ల ఆయా వార్డుల ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని విజ్ఞప్తి చేశారు.

డబుల్ బెడ్రూంలు పేదలకు అందాలి



మంత్రి పొన్నంను కలిసిన సిద్దిపేట కౌన్సిలర్‌లు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలో డబుల్ బెడ్‌రూంల కేటాయింపులో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవాలని, ఖాళీగా ఉన్న వాటిని పేదలకు పంపిణీ చేయాలని సిద్దిపేట కౌన్సిలర్‌లు మహ్మద్ రియాజుద్దీన్, ముత్యాల శ్రీదేవి బుచ్చిరెడ్డి, సాకి బాల్‌లక్ష్మీ ఆనంద్ కోరారు. బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను హైదరాబాద్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో వారు మర్యాదపూర్వకంగా కలిశారు. పై విషయంలో మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. కాగా, మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కమిషనర్‌ను వేదిక కింద కూర్చోబెట్టి అవమానించిన విషయాల ను పొన్నం దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ ఏఈ మారుతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణంలోని లక్ష్మీప్రసన్న కాలనీ, వైష్ణవి గార్డెన్, పోలీసు స్టేషన్ రోడ్, ఆఫీసర్స్ కాలనీ, హౌసింగ్‌బోర్డు కాలనీ, ముట్రాజ్‌పల్లి ప్రాంతాల్లో గురువారం ఉదయం 6 నుంచి 8.45 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందన్నారు. పట్టణ శివారులోని ఎస్సీ కాలనీ పరిసర ప్రాంతాల్లోని పరిశ్రమలకు సైతం ఉదయం 10 నుంచి 12 గంటల మధ్య విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

త్వరగా రోడ్లను పూర్తి చేయాలి

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆదేశం

దుబ్బాక: నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణాలకు త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధిపై హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ వసంతనాయక్, అధికారులతో కలిసి ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గతంలో మంజూరైన రోడ్ల నిర్మాణ పనులు నిలిచిపోయాయన్నారు. తొగుట మండలం మెట్టు–అల్వాల రోడ్డుతో పాటు నియోజకవర్గంలోని మిగతా అంతర్గత అనుసంధాన రోడ్లు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. దుబ్బాక పట్టణంలోని రామసముద్రం, పెద్దచెరువుల కట్టల కింద రోడ్లపైకి చెరువు నీరు రాకుండా డ్రెయిన్లు నిర్మించాలన్నారు. దుబ్బాక–హబ్షీపూర్ నాలుగు లేన్ల రోడ్డుతో పాటు అందె–తిమ్మాపూర్, సూరంపల్లి–నాచారం, మొండిచింత–బేగంపేట సింగిల్ రోడ్లను డబుల్ రోడ్లుగా మార్చేందుకు తగిన ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. గతంలో అల్వాల బ్రిడ్జితో పాటు పలు పనుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు ఇచ్చామన్నారు. నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి కావాల్సిన నిధులు మంజూరుకు కృషి చేస్తానన్నారు. సమావేశంలో ఈఈ బాలప్రసాద్, డీఈలు వెంకటేశం, శ్రీనివాస్ ఉన్నారు.

రూ.35 కోట్లతో మౌలిక సదుపాయాలు

- ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య
- కలెక్టర్ మనుచౌదరి

కొండపాక(గజ్వేల్): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం రూ.35 కోట్లతో పనులు చేపట్టిందని కలెక్టర్ మనుచౌదరి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని దుద్దెడ.. హైస్కూల్లో నిర్వహించిన బడిబాటలో విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా 814 ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. 15 రోజుల్లో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి అయ్యేలా చూసుకోవాలన్నారు. తాను కూడా మంచిర్యాల జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొని ఈ స్థాయికి ఎదిగానన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధనలు అందుతాయన్నారు. దుద్దెడలో హైస్కూల్లో ఈ ఏడాది నూతనంగా 66 మంది విద్యార్థులు చేరడం పట్ల ఉపాధ్యాయుల పనితీరులను అభినందించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, డీపీఓ దేవకీదేవి, ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి, హెచ్ఎం లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి చక్రపాణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



దుద్దెడ హైస్కూల్లో విద్యార్థికి యూనిఫాంను అందజేస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన

- పారిశుద్ధ్యానికి పెద్దపీట
- అధికారులకు అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ సూచన

సిద్దిపేటరూరల్: వానాకాలంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో అధికారులతో కలిసి ఆమె జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. గ్రామాలు, పట్టణాలలో పకడ్బందీగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. తాగునీటి ట్యాంకులను శుభ్రపరిచి క్లోరినేషన్ చేయాలన్నారు. నీటి సరఫరా అయ్యే పైపులైన్లు లీకేజీలు కాకుండా చూడాలని సూచించారు. వర్షపు నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని, ఫ్రైడే డ్రైడే నిర్వహించాలన్నారు. గురువారం మున్సిపాలిటీలు, మండల, గ్రామ స్థాయి అధికారులతో సమావేశాలను నిర్వహించాలని ఆదేశించారు. ఈ సీజన్‌లో నీటి కాలుష్యం కావడం వల్ల ఎన్నో ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్, డీపీఓ దేవకీదేవి, జెడ్పీ సీఈఓ రమేశ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ శ్రీనివాసాచారి, మునిసిపల్ కమిషనర్లు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు పాల్గొన్నారు.



జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

అప్రమత్తతతోనే..

సిద్దిపేటకమాన్: వర్షాకాలం నేపథ్యంలో అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు ముందస్తు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని డీఎంహెచ్ఓ శ్రీనివాస్ సిబ్బందికి సూచించారు. కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో వైద్యాధికారులు, సిబ్బందితో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పీహెచ్‌సీల్లో అన్ని రకాల మందులు ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో డాక్టర్ వినోద్ బాబ్జి, డాక్టర్ విజయరాణి, డాక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా వైద్యసేవలు

- మందుల కొరత రానివ్వొద్దు
- మాజీ మంత్రి హరీశ్‌రావు
- ప్రభుత్వాసుపత్రిలో ఆకస్మిక తనిఖీ

సిద్దిపేటకమాన్: కార్పొరేట్ వైద్యానికి దీటుగా నాణ్యమైన వైద్య సేవలకు పెట్టింది పేరైన సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఇకపైన కూడా మెరుగైన వైద్య సేవలు అందించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధ జనరల్ ఆసుపత్రిని ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చికిత్స పొందుతున్న పేషెంట్లను, వారి బంధువులను ఆత్మీయంగా పలకరించి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందించే భోజనంపై నిర్లక్ష్యం లేకుండా చూడాలని సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్‌కుమార్ను కోరారు. ఆర్ఎంఓలు హేమలత, చంద్రశేఖర్, సదానందం, వైద్యులతో కలిసి ఆయన ఆసుపత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదోళ్ల సౌలతుల కోసమే సర్కారు దవాఖానా ఉందని అన్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి డబ్బులు ఖర్చు చేసుకోవద్దన్నారు. ఇక్కడే మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ఫార్మసీ విభాగాన్ని సందర్శించి స్టాక్ లేని మందులను తెప్పించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో మందులు, వైద్య పరీక్షల కోసం రోగులను బయటకు పంపించవద్దని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. 24 గంటలు మెరుగైన వైద్యం అందుతుందన్నారు. ఆయా విభాగాల వైద్య సేవలు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఎమర్జెన్సీ (అత్యవసర) సేవలను మరింత పటిష్టపరచాలని సూచించారు. మెడికల్ కళాశాల ఎంబీబీఎస్, పీజీ విద్యార్థులు, వైద్యులు, అధ్యాపకుల సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బాలింతతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఈ విద్యాసంవత్సరంలో అన్ని విద్యాసంస్థలలో చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యాశాఖ అధికారులు కృషి చేయాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు విద్యాశాఖ అధికారులకు సూచించారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విద్యాశాఖ అధికారులతో కలిసి ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని 27 ప్రభుత్వ పాఠశాలల్లో 75 మంది విద్యార్థులు 10/10 జీపీఏ సాధించారన్నారు. నియోజకవర్గంలోని 67 ప్రభుత్వ పాఠశాలల్లో 60 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయన్నారు.

క్రీడాకారుల అభ్యున్నతికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న లింగమూర్తి

హుస్నాబాద్: నియోజకవర్గంలోని 165 గ్రామాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులను వెలికి తీయడానికి మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి చేస్తున్నారని క్రీడల అభివృద్ధి కమిటీ నియోజకవర్గ అధ్యక్షుడు కేడం లింగమూర్తి అన్నారు. బుధవారం పట్టణంలో నియోజకవర్గ క్రీడల అభివృద్ధిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువత మంచి తోవలో వెళ్లాలన్నారు. క్రికెట్‌తో పాటు ఇతర ఆటలపై ఆసక్తి చూపించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే మినీ స్టేడియానికి అంకురార్పణ జరిగిందని గుర్తు చేశారు. ఇప్పుడు ఆపార్టీ అధికారంలో ఉన్నందున క్రీడల శాఖకు ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. పలు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

పిల్లల భవిష్యత్‌కు బాటలు వేద్దాం

ప్రిన్సిపల్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రియాంక

గజ్వేల్‌రూరల్: బాల కార్మికుల సమాజాన్ని నిర్మూలించి పిల్లల బంగారు భవిష్యత్‌కు బాటలు వేద్దామని ప్రిన్సిపల్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రియాంక పేర్కొన్నారు. అంతర్జాతీయ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలోని కోర్టు ఆవరణలో మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జడ్జి మాట్లాడారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ(ఐఎల్ఓ) 2002 నుంచి బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పిల్లలతో పని చేయించడం వల్ల శారీరకంగా, మానసికంగా, సామాజికంగా వెనుకబాటుకు గురవడంతో పాటు నిరక్షరాస్యులుగా మారుతున్నారని చెప్పారు. పేద కుటుంబాలు తమ కుటుంబ అవసరాలు, అదనపు ఆదాయం కారణంగా 5 నుంచి 14 ఏళ్ల వయసు గల బాలలు ఎంతో మంది కార్మికులుగా జీవిస్తున్నారన్నారు. వ్యవసాయ పనుల్లో, నిర్మాణ రంగాలు, ఇటుక బట్టీలు, పలకల తయారీ, క్వారీలు, గాజు పరిశ్రమలు, మైనింగ్ రంగాల్లో వెట్టిచాకిరీ చేస్తున్నారని తెలిపారు. భారత ప్రభుత్వం 2016 సెప్టెంబర్ 1న బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం ప్రత్యేక సవరణ చట్టాన్ని తీసుకు వచ్చిందని గుర్తుచేశారు. తద్వారా 14 ఏళ్ల లోపు పిల్లలు పని చేయడానికి వీలు లేదన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఈ సందర్భంగా బాల కార్మిక వ్యతిరేక వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు హరికృష్ణ, నాగిరెడ్డి, సుదర్శన్, రామకృష్ణ, బాలల సంక్షేమ సమితి జిల్లా కమిటీ సభ్యులు దేశబోయిన నర్సింహులు, మండల్ లీగల్ సర్వీస్ సిబ్బంది నర్సింహాచారి, యామిని, కోర్టు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జడ్జి ప్రియాంక, న్యాయవాదులు తదితరులు

హోం వర్క్ @ ఎడ్ల బండి



పాఠశాలల్లో హోం వర్క్ ఇస్తే విద్యార్థులు తమ ఇళ్లలో చేసుకోవడం సాధారణం. మరీ ఎడ్లబండిపై కూర్చొని ఈ ఇద్దరు చిన్నారులు రాసుకోవడం ప్రత్యేకం కదా!. ఈ దృశ్యం మండలంలోని తిగుల్‌లో కనిపించింది. బుధవారం పాఠశాలలు పునః ప్రారంభించారు. తొలిరోజు చాలా మంది పాఠశాలలకు గైర్హాజరయ్యారు. కొందరు అమ్మనాన్నతో కలిసి ఇంటి వద్ద ఉండగా.. ఇంకొందరు పొలం బాట పట్టారు. వ్యవసాయ పనుల్లో అమ్మనాన్న నిమగ్నమవ్వగా వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా పై విద్యార్థులు శ్రద్ధతో చదువుకుంటున్నారు.

–జగదేవ్‌పూర్(గజ్వేల్)

సరస్వతీ నమోస్తుతే



పలు స్కూల్స్ ఆవరణల్లో ఉన్న చదువుల తల్లి సరస్వతిని నమస్కరించారు విద్యార్థులు. అమ్మను దర్శించుకొని తరగతి గదుల్లోకి వెళ్లారు. బుధవారం పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా వర్గల్ మండలం శాకారం, తున్కిఖాల్సా, గౌరారం తదితర పాఠశాలల్లోని విద్యార్థులు మాత ఆశీస్సులు పొందారు.

–వర్గల్(గజ్వేల్)

భగీరథ సర్వే నుంచి మినహాయించండి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నేతలు, అంగన్‌వాడీలు

సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

సిద్దిపేటరూరల్: జిల్లాలో చేపడుతున్న మిషన్ భగీరథ సర్వే నుంచి అంగన్‌వాడీ టీచర్లకు మినహాయింపు ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీలతో కలిసి సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో మిషన్ భగీరథ సర్వేను అంగన్‌వాడీ టీచర్లు నిరాకరించారని, అయినా గానీ బలవంతంగా పని చేస్తున్నారని ఇది సరికాదన్నారు. ఇప్పటికే ఐసీడీఎస్ సెంటర్లలో విధులు నిర్వహిస్తూనే మరో వైపు అనేక రకాల సర్వేలు చేస్తున్నారన్నారు. పిల్లల పోషణకు గర్భిణులకు అన్ని రకాల సేవలను చేస్తున్నటువంటి వారిని మరోమారు మిషన్ భగీరథ సర్వేలు చేయాలని చెప్పడం తగదన్నారు. ధర్నాలో సంఘం జిల్లా కోశాధికారి జి.భాస్కర్, జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.పద్మ, జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి, కోశాధికారి పద్మ, అంగన్‌వాడీలు లక్ష్మి, వసంత, అనిత, శ్యామల, శబరి, సురేఖ, భూలక్ష్మి పాల్గొన్నారు.



కొడిపల్లి(నర్సాపూర్): బెలూన్లు, పుష్పగుచ్ఛంతో విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు



సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలకు హాజరైన విద్యార్థులు



సిద్దిపేటలో మామిడాకులతో విద్యార్థులు



పాఠశాలకు వస్తున్న బాలురు



తరగతి గదిలో చిన్నారులు



పిల్లలతో పాఠశాల సిబ్బంది



పాఠశాలకు వస్తున్న విద్యార్థిని

ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్ సంగారెడ్డి

క్లుప్తంగా

మూడు స్కూల్ బస్సులు సీజ్



వాహన పత్రాలను పరిశీలిస్తున్న ఎంవీఐ విజయరావు

పటాన్‌చెరు టౌన్: విద్యాసంస్థలు ప్రారంభమైన నేపథ్యంలో బస్సుల ఫిట్‌నెస్ పరిశీలిస్తున్నట్లు పటాన్‌చెరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) విజయరావు అన్నారు. బుధవారం బీరంగూడ కమాన్ సమీపంలో రవాణా శాఖ సిబ్బందితో కలిసి స్కూల్ బస్సులను తనిఖీ చేశారు. మొత్తం ఐదు బస్సులను తనిఖీ చేసి ఫిట్‌నెస్ లేని మూడు బస్సులను సీజ్ చేసినట్లు తెలిపారు. విద్యాసంస్థల బస్సులు తప్పనిసరిగా ఫిట్ నెస్ చేయించుకోవాలన్నారు.

దర్యాప్తు వేగవంతం

బాలుడి మృతి కేసుకు ఐదు బృందాలు ఏర్పాటు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం ముత్తంగి రింగ్ రోడ్ సమీపంలోనీ కర్దనూర్ గ్రామం వైపు వెళ్లే సర్వీస్ రోడ్‌లో గుర్తు తెలియని బాలుడు అనుమానాస్పదంగా మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పోలీసులు ఐదు బృందాలుగా ఏర్పడి బాలుడి కేసును దర్యాప్తు చేస్తున్నారు. బాలుడి మృతదేహం లభ్యమైన చోట పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. సోషల్ మీడియాలో పోలీసులు వైరల్ చేస్తూ బాలుడికి సంబంధించిన వారు ఉంటే సంప్రదించాలని తెలిపారు.

డబుల్ బెడ్రూం ఇళ్ల సమస్యపై చర్చ

రెవెన్యూ అధికారులతో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న నర్సారెడ్డి

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్ల సమస్యపై డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి రెవెన్యూ అధికారులతో చర్చించారు. బుధవారం స్థానిక ఎమ్మార్వో కార్యాలయంలో తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌తో సమావేశమై ఇళ్ల పంపిణీకి ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. అదే విధంగా పెండింగ్‌లో ఉన్న ఆర్‌అండ్‌ఆర్ కాలనీవాసుల సమస్యలపై కూడా చర్చించారు. అంతకుముందు ఐవోసీ మొదటి అంతస్తులో పోస్టాఫీసు ఉండడం వల్ల వృద్ధులకు ఇబ్బంది ఏర్పడుతుందని, దీనిని పాత మండల పరిషత్ కార్యాలయంలోకి మార్చే దిశగా కలెక్టర్‌ను కోరతామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రస్తుత పోస్టాఫీస్‌ను సందర్శించి ఈ విషయాన్ని అక్కడి అధికారులకు వివరించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పూలు, చాక్లెట్లతో విద్యార్థులకు స్వాగతం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

బెజ్జంకి(సిద్దిపేట): ప్రభుత్వ పాఠశాలలను బుధవారం ప్రారంభించారు. మండలంలోని కల్లెపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రెడ్ కార్పెట్ వేసి పూలు చల్లి విద్యార్థులకు చాక్లెట్లు ఇస్తూ ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. విద్యార్థుల్లో ఉత్సాహం నింపేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు హెచ్ఎం నజీర్ తెలిపారు. బెజ్జంకి, గుండారం తదితర పాఠశాలల్లో విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన పాఠ్య పుస్తకాలలో ముందు మాటలో సీఎంగా కేసీఆర్ పేరుతో పాటు మాజీ మంత్రుల పేర్లు ఉండటం పైన కాంగ్రెస్ నాయకుడు మానాల రవి మండి పడ్డారు. ఇది అధికారుల నిర్లక్ష్యమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.

హైనా దాడిలో దూడ మృతి

చిన్నకోడూరు(సిద్దిపేట): హైనా దాడిలో దూడ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మాచాపూర్ మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన కర్రె తిరుపతి రోజు మాదిరిగానే వ్యవసాయ పొలం వద్ద పశువులను, దూడను పాకలో కట్టేసి ఇంటికొచ్చాడు. ఉదయం వెళ్లే సరికి దూడ తీవ్ర గాయాలతో మృతి చెంది ఉంది. సమాచారం తెలుసుకున్న అటవీ శాఖ బీట్ ఆఫీసర్ శ్రీకాంత్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. హైనా దాడి చేసినట్లు నిర్ధారించారు. చుట్టు ప్రక్కల గ్రామాల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బడిబాట.. ఉత్తుత్తి మాట



తెరుచుకోని చాంద్‌ఖాన్‌పల్లి పాఠశాల

- చివరి రోజు పాఠశాలలకు తాళాలు
- అధ్యాపకులు రాని వైనం
- డీఈవో విచారణ

నారాయణఖేడ్: బడిబాట చివరి రోజు పాఠశాలలో అధ్యాపకులు లేని విషయంపై వచ్చిన ఫిర్యాదుల మేరకు డీఈవో విచారణ చేపట్టారు. నారాయణఖేడ్ మండలంలోని చాంద్‌ఖాన్‌పల్లి, కొండాపూర్ స్కూల్ తండాలో బడిబాట చివరి రోజైన మంగళవారం అధ్యాపకులు పాఠశాలలకు తాళాలు తీయలేదు. చాంద్‌ఖాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి వరకు విద్యాబోధన జరుగుతుండగా ఐదుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. కొండాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు ఒక్కరే ఉండగా రాలేదు. నారాయణఖేడ్ పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలల దుస్థితి ఇది. చివరిరోజు బడిబాట కార్యక్రమాన్ని సైతం నిర్వహించలేదు. దీంతో చాలామంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల బాట పడుతున్నారు. గ్రామస్తులు, తండావాసులను అడిగితే పాఠశాలలకు సెలవులు ఇచ్చిన నుంచి ఉపాధ్యాయులు రావడం లేదని పేర్కొన్నారు.



తాళం వేసిన ఉన్న కొండాపూర్ పాఠశాల

ఎంఈవో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో..

ప్రైవేట్ పాఠశాలల అధ్యాపకులు గ్రామాలకు వచ్చి ప్రచారం చేస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. పాఠశాలలు, బడిబాటను పర్యవేక్షించాల్సిన ఎంఈవో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాఠశాలల దుస్థితి ఈ విధంగా కొనసాగుతుంది. ఎంఈవో విశ్వనాథంను ప్రశ్నిస్తే పాఠశాల వివరాలు తన వద్ద లేవంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. ఈ పాఠశాలల దుస్థితిపై డీఈవో దృష్టికి తీసుకెళ్లడంతో మెమోలు జారీ చేస్తానని తెలిపారు. బడీడు పిల్లలను బడిలో చేర్పిస్తూ సర్కార్ పాఠశాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ నిర్వహించేందుకు బడిబాట చేపట్టడం జరిగిందన్నారు. అధ్యాపకులు రాకపోవడం, పాఠశాలకు తాళాలు తెరవకపోడంపై విచారణ చేస్తామన్నారు.

కంగ్రాట్స్.. థ్యాంక్స్ అన్నా



లారీని జెండాలు ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎంపీ రఘునందన్‌రావు

- హరీశ్‌రావు, రఘునందన్‌రావుల మధ్య ఆసక్తికర సన్నివేశం
- సిద్దిపేటలో ఓ కార్యక్రమానికి ఇద్దరు హాజరు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పార్లమెంట్ ఎన్నికల ఓటింగ్ పూర్తయ్యే వరకు ఉప్పు, నిప్పుల ఉన్న మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, మెదక్ ఎంపీ రఘునందన్‌రావుల పలకరింపుతో అక్కడే ఉన్న ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆసక్తిగా గమనించారు. వివరాల్లోకి వెళ్తే.. బుధవారం అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో సరుకులతో కూడిన లారీని బుధవారం శ్రీ శరభేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమర్‌నాథ్‌కు పంపించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు హాజరయ్యారు. ముందుగా ఎంపీ రఘునందన్‌రావు హాజరై శివపార్వతుల కళ్యాణానికి వీక్షిస్తుండగా ఎమ్మెల్యే హరీశ్‌రావు వచ్చారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు రఘునందన్ రావుకు కంగ్రాట్యులేషన్స్ చెప్పడంతో రఘునందన్‌రావు ప్రతిగా థ్యాంక్స్ అన్న అన్నారు. దీంతో అక్కడ ఉన్న ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు, భక్తులు ఇద్దరిని ఆసక్తిగా గమనించారు. శివపార్వతుల కళ్యాణం అనంతరం జెండాను ఊపి సరుకుల వాహనాన్ని ప్రారంభించారు. అంతకు ముందు అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి సభ్యులు ఎంపీ, ఎమ్మెల్యేలను ఘనంగా సన్మానించి, తీర్థ ప్రసాదాలు అందించారు.

సిద్దిపేట ఓటర్ల పాత్ర కీలకం

మెదక్ ఎంపీగా గెలుపులో సిద్దిపేట నియోజకవర్గ ఓటర్ల ప్రాత కీలకంగా మారిందని ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. మెదక్ ఎంపీగా విజయం సాధించిన తరువాత తొలిసారిగా బుధవారం సిద్దిపేటకు వచ్చారు. జిల్లా కేంద్రంలో శ్రీ శరభేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయంలో నా కంటే అధికంగా కష్టపడిన బూత్ కమిటీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీలను అమలు చేస్తా..

మెదక్ ఎంపీ రఘునందన్ రావు



ఎంపీ రఘునందన్ రావును సన్మానిస్తున్న గేటెడ్ కమ్యూనిటీ కాలనీవాసులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పార్లమెంట్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేస్తానని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. మంగళవారం రాత్రి తెల్లాపూర్‌లో గేటెడ్ కమ్యూనిటీ కాలనీవాసులు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో తనకు మంచి మెజార్టీ వచ్చిందని, ఈ మెజార్టీని ఇచ్చిన తెల్లాపూర్ మున్సిపల్ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యుత్‌నగర్ నుంచి తెల్లాపూర్ వెళ్లే మార్గంలోని రైల్వే అండర్ బ్రిడ్జిను అభివృద్ధి చేస్తానన్నారు. తెల్లాపూర్ రైల్వే స్టేషన్‌లో పుట్‌ఓవర్ బ్రిడ్జి ఏర్పాటుతోపాటు తెల్లాపూర్ వరకు ఎంఎంటీఎస్ రైలు సర్వీస్‌లను పెంచే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అసంపూర్తిగా ఉన్న రేడియల్ రోడ్డు, తెల్లాపూర్‌లో పోస్ట్ ఆఫీస్ ఏర్పాటు వంటి పనులు చేస్తానన్నారు. భారీ మెజార్టీతో గెలిపించిన ప్రతీ ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శంషాబాద్ రాజు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు మల్లేపల్లి రాజేందర్ రెడ్డి, తెల్లాపూర్ నైబర్‌హుడ్ ప్రతినిధులు ఈశ్వరగారి రమణ, శరత్, సుధాకర్, వెంకట్ రెడ్డి, రాజు, ప్రదీప్ రెడ్డి, దీప్తి, తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

శాస్త్రవేత్త విజయ్‌కుమార్



రైతులతో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

జహీరాబాద్ టౌన్: యాజమాన్య పద్ధతులు పాటిస్తే చెరకు పంటలో అధిక దిగుబడి సాధించొచ్చని న్యాల్‌కల్ మండలంలోని బసంత్‌పూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్ సూచించారు. మొగుడంపల్లి మండలంలోని గౌసాబాద్ గ్రామంలో రైతులు సాగు చేస్తున్న చెరకు తోటలను ఆయన వ్యవసాయశాఖ ఏడీఏ భిక్షపతితో కలిసి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పంట సాగుతో పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రస్తుతం చెరకులో పొక్కబోయిన తెగుళ్ల ఆశిస్తున్నాయని, ఫలితంగా ఆకులు ముడతలు పడి పంట ఎదుగుదల ఆగిపోయిందన్నారు. నివారణకు సాఫ్ 3 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. జొన్న మల్లె కూడా పంటను దెబ్బతీస్తుందన్నారు. జొన్న మల్లె కలుపు మొక్క నివారణకు 2,4డీ నాక్ వీడ్‌ను 5 మిల్లీ లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. పంట మొదళ్లలో మట్టిన ఎగదోయాలన్నారు. ఆయన వెంట ఏడీఏ భిక్షపతి, ఏఓ వినోద్‌కుమార్, ఏఈ ప్రవీణ్, ఆత్మబీటీఎం చరణ్, పాల్గొన్నారు.

పిడుగుపాటుకు 41 గొర్రెలు మృతి



మృత్యువాత పడ్డ గొర్రెలు

రామాయంపేట(మెదక్): పిడుగుపాటుకు గొర్రెలు మృతి చెందిన ఘటన రామాయంపేట పట్టణ శివారులోని వెంకన్నగారి చెరువు సమీపంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బుధవారం సాయంత్రం ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో గొర్రెల కాపరులు చెట్టు కింద ఆశ్రయం పొందారు. ఒక్కసారిగా పిడుగుపడటంతో 41 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. గాయంతి కనకరాజుకు చెందిన 13 గొర్రెలు, మహేశ్‌కు చెందిన 14, మల్లయ్యకు చెందిన 14 మృత్యువాత పడ్డాయి. విషయం తెలుసుకొని స్థానిక తహసీల్దార్ రజనీ కుమారి ఘటనా స్థలిని సందర్శించారు. మున్సిపల్ కౌన్సిలర్ దేమో యాదగిరి, బీజేపీ పట్టణాధ్యక్షుడు శంకర్‌గౌడ్ బాధితులను పరామర్శించారు.

పాడి గేదె..

కొమురవెల్లి(సిద్దిపేట): పిడుగుపాటుకు పాడి గేదె మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన రైతు పుట్ట రాజు పాడి గేదెలను వ్యవసాయ బావి వద్ద చెట్టుకు కట్టేశాడు. బుధవారం సాయత్రం పిడుగుపడి గేదె మృతి చెందింది. దీంతో రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపారు.

అందోల్‌లో మహిళా రైతు

వట్‌పల్లి(అందోల్): పిడుగుపాటుకు మహిళా రైతు మృతి చెందిన ఘటన సంగారెడ్డి జిల్లా అందోలు మండల పరిధిలోని నేరడిగుంట గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన అందోలు అంజమ్మ(55) బుధవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి సొంత పొలంలో పత్తి విత్తనాలు వేయడానికి వెళ్లింది. సాయంత్రం సమయంలో పెద్ద ఎత్తున ఉరుములతో కూడిన వర్షం కురుస్తుండగా నలుగురు చెట్టు కిందికి వెళ్లారు. అప్పుడే ఒక్కసారిగా పిడుగుపడటంతో అంజమ్మతోపాటు ఆమె కొడుకు సాయిలు, కోడలు పూజిత, అల్లుడు సామ్మసిల్లి పడిపోయారు. కొద్దిసేపటి తర్వాత అంజమ్మ మినహా మిగితా వారంతా తేరుకున్నారు. వెంటనే ఆమెను జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు.

ఉద్యోగానికి వెళ్తున్నానని చెప్పి..

యువతి అదృశ్యం



మనూష (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: యువతి అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ కుర్షిద్ అలీ కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం లక్డారం గ్రామానికి చెందిన మనూష (24) ఇస్నాపూర్ లో ప్రైవేట్ జాబ్ చేస్తుంది. ఈ నెల 10వ తేదీన ఉదయం ఇంటి నుంచి ఉద్యోగానికి వెళ్తున్నానని చెప్పి వెళ్లింది. సాయంత్రమైనా మనూష ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. కూతురి అదృశ్యంపై తండ్రి పాపయ్య బుధవారం పోలీసులకు పిర్యాదు చేశాడు.

తల్లి అదృశ్యంపై ఫిర్యాదు

పటాన్‌చెరు టౌన్: తల్లి అదృశ్యంపై కుమారుడు ఫిర్యాదు చేశాడు. అమీన్‌పూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం.. ప్రకాశం జిల్లాకు చెందిన రాజు తన తల్లి సుబ్బులుతో కలిసి బీరంగూడ లింగమయ్య కాలనీలో ఉంటూ మేస్త్రి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 11వ తేదీ సాయంత్రం రాజు మద్యం తాగి ఇంటికి రావడంతో తల్లి మందలించింది. దీంతో రాజు ఇంటి నుంచి వెళ్లిన కొద్దిసేపటికి రాజుకు అతని మామ ఏడుకొండలు ఫోన్ చేసి సుబ్బులు నీకోసం వెతుక్కుంటూ వచ్చిందని తెలిపాడు. దీంతో తల్లి కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. తల్లి అదృశ్యంపై రాజు బుధవారం పోలీసులకు చేశాడు.

కారు, లారీ ఢీ

ఇద్దరికి తీవ్ర, మరో ముగ్గురికి స్వల్ప గాయాలు

నర్సాపూర్: కారు, లారీ ఢీకొనడంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు, మరో ముగ్గురికి స్వల్ప గాయాలు అయ్యాయి, ఈ ఘటన నర్సాపూర్ మెయిన్ రోడ్డు చౌరస్తాలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ పుష్పరాజ్ కథనం మేరకు.. హైదరాబాద్‌లోని దుండిగల్‌కు చెందిన మహేశ్, యూసుఫ్‌గూడకు చెందిన అక్షయ్, మాదాపూర్‌కు చెందిన మరో ముగ్గురు కారులో ఏడుపాయలకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో నర్సాపూర్ మెయిన్ రోడ్డు చౌరస్తాకు రాగానే సంగారెడ్డి వైపు నుంచి వస్తున్న లారీ వీరి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహేశ్, అక్షయ్‌కు తీవ్ర గాయాలు మరో ముగ్గురికి స్వల్ప గాయాలు అయ్యాయి. అదే సమయంలో చౌరస్తా వద్ద పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు క్షతగాత్రులను ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని..

మద్దూరు(హుస్నాబాద్): ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలైన ఘటన దూళ్మిట్ట మండలంలోని బెక్కల్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ జగదీశ్వర్ కథనం మేరకు.. యాద్రాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌కు చెందిన మంజిరి నరేశ్ బైక్‌పై అక్కన్నపేట మండలం రామవరం గ్రామానికి వెళ్లి బీబీనగర్ తిరిగి వెళ్తున్నాడు.బెక్కల్ గుట్ట సమీపంలో జనగామ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నరేశ్‌ను ఎదురుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నరేశ్‌కు తీవ్ర గాయాలు కాగా వెంటనే సిద్దిపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. నరేశ్ భార్య అంజలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఆస్తి కోసం తల్లిని చంపిన కొడుకు!

చిన్నకోడూరు మండలంలో ఘటన



సత్తవ్వ (ఫైల్)

చిన్నకోడూరు(సిద్దిపేట): ఆస్తి కోసం తల్లిని కన్న కొడుకే కడతేర్చిన హృదయ విషాదకర ఘటన చిన్నకోడూరు మండల పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు కథనం మేరకు.. గ్రామానికి చెందిన అంతగిరి మల్లయ్యకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య సత్తవ్వ(65)కు ఒక కుమారుడు. రెండవ భార్య పోశవ్వకు ఇద్దరు కుమారులు. మల్లయ్య రెండో భార్యతో ఉంటున్నాడు. మొదటి భార్య సత్తవ్వ పేరున ఐదు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. సత్తవ్వ కుమారుడు చంద్రశేఖర్ సిద్దిపేటలో నివసిస్తాడు. మంగళవారం రాత్రి చంద్రశేఖర్ గంగాపూర్ గ్రామంలోని తల్లి వద్దకు వచ్చాడు. ఐదు ఎకరాల భూమిని తన పేరున చేయాలని తల్లితో గొడవ పడ్డాడు. కానీ సత్తవ్వ మాత్రం తన సొంత చెల్లెలు పోశవ్వకు కూడా ఇద్దరు కుమారులు ఉన్నారని అందరికీ సమానంగా తండ్రి ఆస్తిని చేసి ఇస్తానని కొడుకుతో చెప్పింది. దీంతో చంద్రశేఖర్ తల్లితో గొడవపడ్డాడు. గొడవ అనంతరం చంద్రశేఖర్ తండ్రి మల్లయ్య వద్దకు వెళ్లి తల్లి ఇంటి వెనుకాల కాలుజారి పడిపోయిందని, తీవ్ర గాయాలయ్యాయని చెప్పాడు. వెంటనే మల్లయ్య వచ్చి భార్యను సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. బుధవారం ఉదయం సమాచారం తెలుసుకున్న సిద్దిపేట ఏసీపీ మధు, ఎస్ఐ బాలకృష్ణ ఘటనా స్థలానికి చేరుకొని విచారించారు. తన భార్యను కుమారుడే కొట్టి చంపినట్లు మల్లయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చంద్రశేఖర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

రాతి యుగపు ఆనవాళ్లు గుర్తింపు



ఖాత గుట్టపై ముద్రలు చూపుతున్న రత్నాకర్‌రెడ్డి

నంగునూరు(సిద్దిపేట): నంగునూరు మండలం ఖాత గ్రామంలోని మహదేవుని గుట్టపై కొత్త రాతి యుగపు ఆనవాళ్లు గుర్తించినట్లు చరిత్ర పరిశోధకుడు రత్నాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామంలోని మహిమాన్వితమైన మహదేవుని గుట్టపై కొత్త రాతియుగం, పెద్దరాతి యుగపు నాటి మానవులు నివసించినట్లు తెలుస్తోందన్నారు. రాతి పొరల్లో నీటి నిల్వలు ఉన్నాయని దీంతో వేసవి కాలంలో సహితం గుండంతోపాటు చాలా చోట్ల నీరు పుష్కలంగా లభిస్తుందని తెలిపారు. అలాగే పోచమ్మ దేవాలయం వద్ద 20కి పైగా గ్రూవ్స్ గుర్తించామని, హనుమాన్ విగ్రహం వద్ద మూడు చోట్ల ఇటుక నిర్మాణాలు కనుక్కున్నామని పేర్కొన్నారు. జల బుగ్గ వద్ద రెండు వేల ఏళ్ల కిందటి డోల్మెన్ రకపు బృహత్ శిల సమాధులు ఉన్నాయన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

హవేళిఘణాపూర్(మెదక్):విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన మెదక్ మండలం పేరూర్ గ్రామంలో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన వెల్మకన్నె నగేశ్(48) ఉదయం పొలం వద్దకు వెళ్లి పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో కాలుజారడంతో విద్యుత్ స్తంభానికి బిగించిన సపోర్టు వైరును పట్టుకున్నాడు. వైరు కరెంట్ షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని గమనించిన రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా అప్పటికే మృతి చెందాడు. అధికారులు ఎన్నో రోజులుగా సపోర్టు వైరుకు ఉన్న పూస విరిగిపోయినా నిర్లక్ష్యంగా ఉంచడం వల్లే అమాయక రైతు ప్రాణాలు పోయాయని, వారి కుటుంబాన్ని ఆదుకునేదెవరంటూ విద్యుత్ శాఖ ఏఈ, ఏడీఏలను రైతుల నిలదీశారు.

40 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యంతో పోలీసులు

సిద్దిపేటకమాన్: ఓ దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్, టూటౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం మేరకు.. పట్టణానికి చెందిన మూడ శ్రీనివాస్ శంకర్‌నగర్‌లోని తన షాపులో అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచాడు. నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, టూటౌన్ పోలీసులు వెళ్లి తనిఖీ చేశారు. షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.